ప్రజాశక్తి

గురువారం 14 ఆగస్టు, 2025

5

శ్రీకాకుళం





జగన్నాథపురంలో రొయ్యల సాగు

వైభవంగా వజ్రోత్సవ వేడుకలు



వాక్ థాన్ ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు

- అందరి భాగస్వామ్యంతోనే జిల్లా ప్రగతి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం జిల్లా ఆవిర్భవించి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వాక్‌థాన్ ర్యాలీని స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వద్ద కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రారంభించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ కూడలి, డేఅండ్‌నైట్ జంక్షన్ మీదుగా ఏడు రోడ్ల కూడలి వరకు సాగింది. ర్యాలీలో కలెక్టర్‌తో పాటు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతోనే జిల్లా ప్రగతి సాధ్యమన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో మూడు రోజుల పాటు పండగ వాతావరణంలో వజ్రోత్సవాలను నిర్వహించడానికి సంకల్పించామన్నారు. యువత జిల్లా 75 ఏళ్ల ప్రస్థానాన్ని తెలుసుకుని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతి పరిరక్షణలో పోలీస్ శాఖ ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులతో కమిటీగా ఏర్పడి, జిల్లా 75 వసంతాల వేడుకలను ప్రారంభించామన్నారు. మూడు రోజుల పాటు ప్రజల భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 15న కోడి రామ్మూర్తి స్టేడియంలో గాయకుడు రామ్ మిరియాలతో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పరిశ్రమల స్థాపనకు సహకరిస్తాం

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తే అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హామీనిచ్చారు. స్థానిక ఒక హోటల్‌లో నిర్వహించిన పారిశ్రామికవేత్తల సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్య లేదని, పరిశ్రమల స్థాపనకు అవసరమైన దరఖాస్తులు సమర్పిస్తే ఎపిఐఐసి ద్వారా భూముల కేటాయింపు చేస్తామని తెలిపారు. విశాఖపట్నం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, భోగాపురం నుంచి మూలపేట పోర్టు వరకు ఆరు లైన్ల రహదారి నిర్మాణం జరుగనున్నందున, సుమారు 193 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, ఆయా కారిడార్ల వెంబడి పరిశ్రమలు నెలకొల్పితే పారిశ్రామికవేత్తలకు ఆదాయంతో పాటు జిల్లా అభివృద్ధికి, నిరుద్యోగ సమస్య నిర్మూలనకు అవకాశం ఉంటుందని వివరించారు. పలాసలో జీడిపప్పు ఉత్పత్తులు, తీరప్రాంతంలోని ఆక్వా ఉత్పత్తులు, జిల్లాలో అధికంగా లభిమయ్యే మామిడి, పనస, జీడి మామిడి తదితర ఉత్పత్తులకు విలువలను జోడిస్తే నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేయొచ్చని చెప్పారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 75 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. జిల్లా వజ్రోత్సవాల సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యాన నిర్వహించిన వీడియో చిత్రీకరణ పోటీల్లో విజేతలను ప్రకటించారు. శ్రీకాకుళం వెదర్ మేన్ వీడియోకు అరవింద్ అత్యుత్తమ ప్రదర్శన చేసి మొదటి బహుమతి గెలుచుకున్నారు. హలో సిక్కోలుకు ప్రశాంత్ రెండో బహుమతి సాధించారు. జిల్లా వజ్రోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ప్రసంగం, చిత్రలేఖనం పోటీలు బుధవారంతో ముగిశాయి. ప్రభుత్వ, మోడల్, సోషల్ వెల్ఫేర్, కస్తూర్బా, ట్రైబల్ వెల్ఫేర్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్ విద్యార్థులు పోటీల్లో తమ ప్రతిభను ఆవిష్కరించారు. ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కోడి రామ్మూర్తి స్టేడియంలో స్వర్ణ శ్రీకాకుళం ఫెయిర్ అండ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో స్టాల్స్‌ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో జిల్లా సంప్రదాయ హస్తకళలు, స్థానిక కళాకారుల కృషిని ప్రతిబింబించే ప్రత్యేక స్టాల్స్, ఆధునిక పరిశ్రమలు, వ్యవసాయ పరికరాలు, పర్యాటక ప్రదర్శనలు, విద్యా విభాగం ప్రాజెక్టులు, సాంస్కృతిక విభాగం ఆవిష్కరణలు ఆకట్టుకుంటున్నాయి. జిల్లాలోని సొంత ఉత్పత్తులు, హస్తకళ వస్తువులు, స్థానిక ఆహార పదార్థాల స్టాళ్లు సందర్శకులను రుచులతో, రంగులతో అలరిస్తున్నాయి. జిల్లాకు చెందిన పలురంగాల ప్రముఖుల చిత్రాలు, సైకతశిల్పాలను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్ వజ్రోత్సవాల ముగింపు వరకు ప్రతిరోజూ సాయంత్రం సందర్శకులకు అందుబాటులో ఉండనుంది. పలు విభాగాల సమాచార స్టాల్స్, వినోద విభాగం ఏర్పాట్లు, సాంస్కృతిక వేదిక సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిఐసి జనరల్ మేనేజర్ జి.ఎం శ్రీధర్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ఆక్వాకు అమెరికా దెబ్బ

అమెరికా విధించిన అధిక సుంకాల ప్రభావం ఆక్వా పరిశ్రమపై గట్టి దెబ్బ పడింది. ఇటీవల భారత సముద్ర ఉత్పత్తులపై అమెరికా 25 శాతం దిగుమతి సుంకం విధించగా, ఈనెల 27 నుంచి మరో 25 శాతం పెంచనుంది. దీంతోపాటు ఇప్పటికే అమల్లో ఉన్న కౌంటర్వెయిలింగ్, యాంటీ డంపింగ్ డ్యూటీలతో కలిపి మొత్తం సుంకం సుమారు 60 శాతానికి చేరింది. అమెరికా విధించిన అధిక టారిఫ్‌ల ప్రభావం రొయ్యల ఎగుమతులపై పడింది. ఫలితంగా ధరలు ఒక్కసారిగా కుప్పకూలడంతో ఆక్వా రైతులకు రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోంది. దీంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.

- అధిక సుంకాలతో ఆక్వా రంగం కుదేలు
- రొయ్యల ఎగుమతులపై టారిఫ్‌ల ప్రభావం
- ఒక్కసారిగా కుప్పకూలిన ధరలు
- రూ.కోట్లలో నష్టాలతో ఆక్వా రైతుల ఆందోళన

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

జిల్లాలో వేలాది ఎకరాల్లో సాగు చేస్తున్న రొయ్యల పెంపకంతో రాష్ట్ర ఖజానాకు అధిక ఆదాయం సమకూరుస్తోంది. జిల్లాలోని సంతబొమ్మాళి, గార, సోంపేట, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, ఎచ్చెర్ల, రణస్థలం, పోలాకి మండలాల్లో విస్తారంగా రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. సుమారు 1500 మంది రైతులు ఈ రంగంపై ఆధారపడి ఉండగా, వీరిలో అధిక శాతం మంది కౌలు రైతులు. సుమారు పది వేల మంది ఆక్వా కార్మికులు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. టైగర్, వనామి వంటి రొయ్యల సాగుతో రూ.200 కోట్లకు పైగా ఆదాయంతో వ్యాపారం సాగుతోంది. ప్రతికూల వాతావరణం, వైరల్ ఇన్ఫెక్షన్ ప్రభావంతో కొంతమంది రైతులు ఒడిదుడుకులకు గురై మూడేళ్లుగా సాగుకు దూరమయ్యారు. ఆక్వా సాగును ప్రోత్సహించేందు కు టిడిపి కూటమి ప్రభుత్వం ఆక్వా రంగానికి విద్యుత్ యూనిట్ రూ.1.50 రాయితీ ఇస్తోంది. దీంతో సాగు చేసేందుకు ముందుకు వచ్చిన రైతులు, ప్రస్తుతం పడిపోయిన ధరలతో ఊహించని రీతిలో నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

అమాంతం పడిపోయిన ధరలు

ఈ ఏడాది వనామీ రొయ్యల ధరలు పెరగడంతో ఆనందం వ్యక్తం చేసిన రైతులు, వచ్చే ఆదాయంతో అప్పులు తీరుతాయనే భావించారు. కానీ, ఆక్వా రైతులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రూపంలో అనుకోని దెబ్బ ఎదురైంది. భారతదేశం నుంచి వెళ్లే సముద్ర ఉత్పత్తులపై ట్రంప్ విధించిన సుంకం గుదిబండలా మారింది. ఒక్కసారిగా పెరిగిన ఎగుమతి సుంకాలతో రొయ్యల వ్యాపారులు అమాంతం కొనుగోలు ధరలు తగ్గించేశారు. ఇష్టానుసారం ధరలను కుదించేయడంతో రైతులకు కోట్లలో నష్టపోయే పరిస్థితి దాపురించింది. ఉదాహరణకు ఒక రైతు ఆగస్టు మొదటి వారంలో 50 టన్నుల రొయ్యలు ఉత్పత్తి చేసి అమ్మితే వచ్చే ధరకు, ప్రస్తుత ధరకు కేజీకి రూ.25 వ్యత్యాసం వచ్చింది. దీంతో సదరు రైతు ఒక్క వారంలోనే రూ.12.50 లక్షలు నష్టపోయాడు. ఈనెల 8వ తేదీ నాటికి 100 కౌంట్ కిలో రొయ్యల ధర 245 ఉండగా, ప్రస్తుతం రూ.220గా ఉంది. 90 కౌంట్ కిలో రొయ్యల ధర 255 నుంచి రూ.240 పడిపోయింది. 80 కౌంట్ రూ.275 నుంచి రూ.255కి, 70 కౌంట్ రూ.295 నుంచి రూ.275, 60 కౌంట్ కిలో రొయ్యల ధర 315 నుంచి రూ.295కి పడిపోయింది. 40 కౌంట్ రూ.365 నుంచి 335, 30 కౌంట్ రూ.425 నుంచి రూ.385కి చేరింది. 25 కౌంట్ కిలో రొయ్యల ధర 475 నుంచి ఏకంగా రూ.50 పడిపోయి రూ.225కి చేరింది. ట్రంప్ ప్రకటించిన మరో 25 శాతం సుంకాలు ఈనెల 27వ తేదీ నుంచి అమల్లోకి రానుండడంతో ఈ ధరలు మరింతగా పడిపోయే అవకాశం ఉంది.

ప్రభుత్వం పరిష్కార చర్యలు చేపట్టాలి

అమెరికా నిర్ణయంతో ఆక్వా రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వం సత్వరమే పరిష్కార మార్గాలు చేపట్టాలని ఆక్వా రైతులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఆక్వా సమస్యపై లేఖ రాసిన రాష్ట్ర ప్రభుత్వం, సమస్యపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమైంది. కేంద్ర ప్రభుత్వం నుంచి సరైన స్పష్టత లేదని రైతులు వాపోతున్నారు. స్థానిక వ్యాపారులు, క్షేత్రస్థాయిలో కంపెనీ ప్రతినిధులను భాగస్వాములు చేసి ఆక్వా రంగం పురోగమనానికి చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. భారత్ నుంచి ఇతర దేశాలకు ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి చేయడానికి ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలించాలని కోరుతున్నారు. ఆక్వా రైతుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, రుణాలపై వడ్డీ మాఫీ, ఎగుమతిదారులపై నియంత్రణ, కనీస మద్దతు ధర వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రత్యామ్నాయాలపై దృష్టిసారించని ప్రభుత్వం

రాష్ట్ర రొయ్యల ఉత్పత్తిలో 70 శాతం అమెరికా, యూరప్, జపాన్ మార్కెట్లకు ఎగుమతి అవుతోంది. అదనపు సుంకాల ప్రభావంతో ఎగుమతులు 30 నుంచి 35 శాతం తగ్గవచ్చని, రైతులకు 40 నుంచి 50 శాతం నష్టం వాటిల్లవచ్చని అంచనా. ప్రత్యామ్నాయ చర్యలుగా ప్రభుత్వం ఇతర దేశాలకు సముద్ర ఉత్పత్తుల ఎగుమతులపై దృష్టిసారించాలని వ్యాపారులు చెప్తున్నారు. కోల్డ్ స్టోరేజీలు నిండిపోవడం వల్ల పంట నిల్వ సమస్యలు మరింతగా పెరిగాయి. ఉత్పత్తి వ్యయాలు కిలోకు రూ.220 నుంచి రూ.230 పెరిగాయని రైతులు చెప్తున్నారు. మార్కెట్ ధర మాత్రం తక్కువగా ఉందని వాపోతున్నారు. వ్యాపారులు కొనుగోళ్లు ఆపడంతో, రూ.కోట్ల పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత ధరలతో తీవ్ర నష్టం



20 సంవత్సరాలుగా రొయ్యల సాగు చేస్తున్నాను. ఎన్నోసార్లు ధరలు తగ్గుతూ సంక్షోభాలు వచ్చాయి. కానీ, ఎగుమతుల కారణంగా ఎప్పుడూ ఇబ్బందులు తలెత్తలేదు. నేను 50 ఎకరాల్లో పంట చేస్తున్నాను. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు అమాంతం పడిన ధరలతో తీవ్ర నష్టం జరుగుతుంది. మరో రెండు నెలల్లో పంట చేతికి అందాల్సిన ఉంది. ఇదే రేట్లు కానీ కొనసాగితే పెట్టుబడులు కూడా వచ్చే అవకాశాలు ఉండవు. ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- పడాల గంగిరెడ్డి, ఆక్వా రైతు, నౌపడ

ధరల పతనంతో ఆందోళన



చాలా ఏళ్లుగా రొయ్యలు సాగు చేస్తున్నాను. ప్రభుత్వం కూడా విద్యుత్ సబ్సిడీ ఇచ్చి రైతులను ప్రోత్సహిస్తుంది. అయితే ప్రస్తుతం ఉన్న ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆక్వా ఎగుమతులపై దృష్టి సారించి విదేశీ మార్కెట్‌ను ప్రోత్సహిస్తే మాలాంటి వారికి లబ్ధి చేకూరుతుంది. ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

- కర్రి బాలకృష్ణ, ఆక్వా రైతు, నౌపడ

కార్పొరేట్ కంపెనీలకు వ్యవసాయం



ర్యాలీ నిర్వహిస్తున్న పలు సంఘాల నాయకులు

- కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వం
- సంయుక్త కిసాన్ మోర్చా, రైతు, కార్మిక సంఘాల నాయకులు
- 'క్విట్ కార్పొరేట్ డే'లో భాగంగా ట్రాక్టర్, బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - పలాస

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని సంయుక్త కిసాన్ మోర్చా, రైతు, కౌలురైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. క్విట్ కార్పొరేట్ నినాదంతో కాశీబుగ్గలోని పెంట దాలయ్య ఆశ్రమం నుంచి పాతబస్టాండ్ మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ట్రాక్టర్, బైక్ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, ఎఐకెఎం జిల్లా కార్యదర్శి మద్దిల రామావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి టి.సన్యాసిరావు, జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ కంపెనీలను రానీయొద్దని డిమాండ్ చేశారు. మూడోసారి అధికారం చేపట్టిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దయిన మూడు నల్ల చట్టాల కన్నా ప్రమాదకరమైన విధానాలను ప్రకటించిందని విమర్శించారు. వ్యవసాయ మార్కెట్ల చట్టాన్ని విదేశీ, స్వదేశీ కంపెనీల ఎగుమతి, దిగుమతి వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు చేసిందన్నారు.

ఈ విధానం ప్రకారం పంటలకు మద్దతు ధరల విధానం ఉండదని, ప్రభుత్వ ఏజెన్సీలు కొనుగోలు చేయవని చెప్పారు. రైతులు నేరుగా గానీ ఎఫ్‌పిఒ గ్రూపులుగా గానీ అగ్రిమెంట్ చేసుకుని కంపెనీల నిబంధనల ప్రకారం పంటలు పండించి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధి ఎత్తివేసిందన్నారు. ఎరువులు, పరికరాలపై సబ్సిడీల కోత విధించిందని, పదేళ్లు దాటిన ట్రాక్టర్లపై నిషేధం విధించిందని, ఎఫ్‌సిఐ తదితర గోడౌన్లన్నీ అదానీకి అప్పగించిందని, ప్రభుత్వ ఏజెన్సీలు కొనడం లేదన్నారు. రష్యా నుంచి మనకు చౌకగా లభ్యమవుతున్న చమురు నిషేధిస్తే మనం వ్యవసాయంలో ఆయిల్ వినియోగించే స్ప్రేయర్ల నుంచి ట్రాక్టర్లు, కోత యంత్రాల వరకు ఖర్చులు పెరిగిపోతాయన్నారు. మనం ఎగుమతి చేసే వస్తువులపై 50 శాతం సుంకాలు విధిస్తానని ట్రంప్ బెదిరిస్తుంటే, మన ప్రధాని మౌనంగా ఉండడం ప్రమాదం కాదా అని ప్రశ్నించారు. ఈ ఏడాది మనం ఎగుమతి చేయగలిగిన మిరపకాయలు, పొగాకు, మామిడిపళ్లు, పప్పు ధాన్యాలు, శనగలు పంటల ధరలన్నీ పడిపోయాయన్నారు. వ్యాపారులందరూ ఏకమై ధరలు తగ్గించి వేశారని, తాజాగా మనం ఎగుమతి చేసే రొయ్యలు సైతం ధరలు పడిపోయాయని తెలిపారు.

మన దేశ అవసరాలకు సరిపడా పండుతున్న వరి, గోధుమ, మొక్కజొన్న పంటలు దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. మనం మిగులు ఉత్పత్తి కలిగిన పాడి, పాల ఉత్పత్తులు, కోళ్లు, కోడిమాంసం దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని, ఆ దేశాల్లో ఇస్తున్న భారీ సబ్సిడీలతో వచ్చి దిగుమతి అవుతాయని తెలిపారు. దీంతో మన రైతాంగం దివాళా తీయడం తప్ప మరో మార్గం ఉండదన్నారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ విరమించాలని, సి2+50 ప్రకారం పంటల మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పదేళ్లు దాటిన ట్రాక్టర్లపై నిషేధం తొలగించాలని, కార్పొరేట్ కంపెనీలకు పంటలు పండే భూములు ఇవ్వరాదని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాల ప్రాధాన్యతా ప్రకారం సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తిచేయాలని, అటవీ హక్కుల చట్టం 1/70 అమలు చేయాలని కోరారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని ఇనుప గనులను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తమ్మినేని భాస్కరరావు, బి.వాసు, కె.దుష్యంత్, కౌలు రైతుసంఘం నాయకులు బి.ఆనందరావు, రవి, ఎన్.ఢిల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుళ్లిన కోడిగుడ్లు



పొందూరు: ప్రభుత్వ పాఠశాలలకు ఏజన్సీలు కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. మండలం కోటిపల్లి ప్రాథమిక పాఠశాలకు సరఫరా చేసిన కోడిగుడ్లు పూర్తిగా కుళ్లిపోయి పురుగులు పట్టి దుర్వాసన రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. భారీగా పురుగులు పట్టడంతో కోడిగుడ్లు పనికిరాకుండా పోయాయి. 10 రోజుల క్రితమే పాఠశాల విద్యార్థులకు కావాల్సిన గుడ్లను ఏజన్సీ సరఫరా చేసింది. క్వాలిటీ గల గుడ్లు సరఫరా చేయకుండా నాణ్యతలేని గుడ్లు సరఫరా చేయడంతో గుడ్లు కుళ్లిపోతున్నాయని పాఠశాల ఉపాధ్యాయుడు జి.చల్లన్నాయుడు తెలిపారు. విషయాన్ని ఎంఇఒకు తెలియజేస్తానన్నారు.

నేడు గ్రామీణ క్రీడలు, వ్యాసరచన పోటీలు

శ్రీకాకుళం : జిల్లా ఏర్పాటై 75 ఏళ్ల వజ్రోత్సవాల రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 14న ఉదయం నుంచి వివిధ క్రీడలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. ఎన్‌టిఆర్ మున్సిపల్ పాఠశాల మైదానంలో కర్రసాము, సాంగిడీ, మగ్గదార్ వంటి గ్రామీణ క్రీడలు నిర్వహించనున్నారు. సుమారు 200 మంది క్రీడాకారులు, 50 మంది అధికారులు పాల్గొననున్నారు. అలాగే ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (మెన్)లో వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు విద్యార్థుల ప్రతిభను ఆవిష్కరించనున్నాయి.

అక్రమ బదిలీలు రద్దు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎమ్మెల్యేల వేధింపులు, అక్రమ బదిలీలకు పాల్పడిన అధికారులపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ జెఎసి రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, సీనియర్ నాయకులు కె.విజయగౌరి డిమాండ్ చేశారు. కెజిబివి ప్రిన్సిపాళ్ల అక్రమ బదిలీలు రద్దు చేయాలన్నారు. ఈ మేరకు నగరంలోని సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని కంచిలి, గార, పొందూరు కెజిబివి ప్రిన్సిపాళ్లపై ఎలాంటి విచారణ చేపట్టకుండా కేవలం స్థానిక ఎమ్మెల్యేల లేఖల ఆధారంగా బదిలీ చేయడంపై వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రిన్సిపాళ్ల బదిలీకి రాష్ట్ర కార్యాలయం అనుమతి తప్పనిసరి అనే నిబంధనను ఉల్లంఘించారని అన్నారు. నాయకుల వేధింపులకు సంబంధించిన ఫోన్ ఆడియో రికార్డిను అందజేసినా సంబంధిత వ్యక్తులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఫిర్యాదు చేసిన మహిళా ప్రిన్సిపాల్‌పైనే చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. సెలవు రోజుల్లో బదిలీ చేస్తూ... ఉత్తర్వులు జారీ సరికాదన్నారు. పొందూరు ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య మాట్లాడుతూ ఆముదాలవలస ఎమ్మెల్యే వేధింపులకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యే నుంచి తనకు ప్రాణహాని ఉందని విలపించారు. ధర్నాలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, సిఐటియు జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, యుటిఎఫ్ కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి జి.సురేష్, కె.సురేష్, జి.విశ్వనాథం పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

నవోదయ 2.0 లక్ష్యసాధనకు కృషి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి- సోంపేట

నవోదయ 2.0 లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఆదేశించారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో సూపరింటెండెంట్ తిరుమతి నాయుడుతో కలిసి బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కేసులు నమోదై పరారీలో ఉన్నవారు, అరెస్టు కాని వారిని తక్షణమే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. సోంపేట ఎక్సైజ్ సర్కిల్‌లోని సోంపేట, కంచిలి, మందస మండలాల లోని నాటు సారా గ్రామాలను నాటు సారా రహిత గ్రామాలుగా చేయడానికి ఆయా గ్రామాల్లో అవగాహనా సదస్సులు, నేర నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో నాటు సారా అమ్మకాల్లో ఉండి మానివేసిన వారికి ఇతర ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. గతంలో నాటు సారాయి కేసుల్లోని వారిని స్థానిక తహశీల్దార్ వద్ద బైండోవర్లు చేయించాలని ఆదేశించారు. కంచిలి, సోంపేట, మందస మండలాల్లో అవసరమైన చోట చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వం నిర్దేశించిన నవోదయం 2.0 లక్ష్యాలను చేరుకోవడానికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో సోంపేట ఎక్సైజ్ సిఐ జి.వి.రమణ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మురళీధర్, పలాస ఎక్సైజ్ సిఐ మల్లిఖార్జునరావు, టాస్కోఫోర్స్ సిఐ మధుకుమార్, ఎస్‌ఐలు కళ్యాణి, సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న పిఒ యశ్వంత్ కుమార్‌రెడ్డి

శిక్షణను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఆది కర్మయోగి కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలని సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆది కర్మయోగి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆది కర్మయోగి ద్వారా కల్పిస్తున్న వివిధ రకాల కోర్సులను ఉద్యోగులందరూ నేర్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ ప్రతినిధి సందీప్, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, తహశీల్దార్ తహసిల్దార్ బడే పాపారావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఉదయ్ శంకర్, ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మనాభరావు, రిసోర్స్‌పర్సన్ కోటిబాబు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ఆర్థిక అక్షరాస్యత అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

విద్యార్థులు బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు అన్నారు. కాకతీయ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్‌షాప్‌నకు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా బ్యాంకింగ్ ఫోల్డర్‌లో చేర్చబడాలన్నారు. ఆర్థిక అక్షరాస్యతను తెలుసుకోవాలన్నారు. బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టి డైరెక్టర్ వి.ఆంజనేయులు, బ్యాంకు అధికారులు డి.మదన్ పాల్గొన్నారు.


ఐశ్వర్యను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందన

రణస్థలం: మండల కేంద్రంలో గల ఐరిస్ సాకల్య పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న లోచర్లపాలెం గ్రామానికి చెందిన సింక ఐశ్వర్య నవోదయలో సీటు సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఐశ్వర్యను అభినందించి మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఒక్క సీటు కోసం 800 మంది విద్యార్థులు పోటీ పడితే జిల్లాలో ఐశ్వర్య ప్రతిభ కనబర్చడం చిన్న విషయం కాదన్నారు. కార్యక్రమంలో ఐరిస్ సాకల్య డైరెక్టర్ హరికృష్ణ, కోష్ట ఎంపిటిసి అసిరినాయుడు, గణిత అధ్యాపకులు రమణ, హిందీ బోధకులు పాపారావు, విద్యార్థి తల్లితండ్రులు పాల్గొన్నారు.



ఎఎంఒ కృష్ణవేణికి వినతిపత్రాన్ని అందజేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలి

పొందూరు: రాష్ట్రంలోని ఎపి మోడల్‌స్కూల్ (ఆదర్శ పాఠశాల) అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర అకడమిక్ మోనటరింగ్ అధికారి (ఎఎంఒ) కృష్ణవేణికి బుధవారం స్థానిక అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వినతిపత్రాన్ని అందజేశారు. పాఠశాల ప్రారంభం నుంచి తమ సేవలను స్కూల్ అభివృద్ధికి నిరంతరం అందిస్తున్నామని, తమకు ఇచ్చే జీతాలు తమ కుటుంబ పోషణకు కూడా సరిపడడం లేదని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేశారని పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇచ్చే విధంగా తమకు జీతాలు పెంచాలని ఆమెను కోరారు. వినతిపత్రాన్ని అందించిన వారిలో కె.సూర్యారావు, ఎం.కిరణ్, సిహెచ్ రామారావు, పి.ఆదినారాయణ, సిహెచ్ రాజారావు, కె.లక్ష్మణరావు తదితరులున్నారు.

జీతాలు విడుదల చేయాలని వినతి

టెక్కలి: రెండు నెలల క్రితం బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు విడుదల చేయాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు టెక్కలి సబ్‌ట్రజరీ అధికారి కళ్యాణ్‌ని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. టెక్కలి సబ్‌ట్రజరీ పరిధిలోని టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాలాకు చెందిన సుమారు 90 మందికి జీతాలు లేవని వివరించారు. జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. ఇప్పటికైన సంబంధిత ట్రజరీ ఉన్నతస్థాయి అధికారులు స్పందించి బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని కోరారు.


తాగునీటి బావిని శుభ్రం చేస్తున్న కూలీలు

బావిలో చెత్త తొలగింపు

ప్రజాశక్తి- పొందూరు

దశాబ్దాలుగా పిచ్చిమొక్కలు పెరిగిపోయి, చెత్తాచెదారాలతో నిండిపోయిన రక్షిత మంచినీటి పథకం తాగునీటి బావికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. మండలం రాపాకలోని రక్షిత మంచినీటి పథకానికి తాగునీరు సరఫరా చేసే తాగునీటి బావిని కార్యదర్శి పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుభ్రపరిచారు. బావిచుట్టూ, లోపల భాగంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, పిచ్చిమొక్కలను తొలగించారు. సుమారు రూ.5 వేల జనాభా కలిగిన ఈ గ్రామానికి ఈ బావినీరే ఆధారం. ఈ తాగునీటి బావి నుంచి గ్రామంలో ట్యాంక్‌కు తాగునీరును పంపించి అక్కడి నుంచి గ్రామంలో పైపుల ద్వారా నీరును సరఫరా చేస్తారు. దశాబ్దాలుగా ఈ బావిని శుభ్రం చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలసత్వం వహించారు. ఇటీవల గ్రామంలో అనుమానిత డయేరియా కేసులు రావడంతో దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో అధికారులు స్పందించడంతో తాగునీటి బావిని శుభ్రం చేశారు. ఎట్టకేలకు తాగునీటి భావిని శుభ్రం చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి- కొత్తూరు

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీలకు ఆరేళ్లుగా ఒక్క రూపాయి వేతనం కూడా పెంచలేదని అన్నారు. డిఎ, పిఆర్‌సి కానీ అమలు చేయడం లేదన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. అంగన్వాడీలకు, గర్భిణులకు, బాలింతలకు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరారు. అంగన్వాడీ సెంటరు నిర్వహణకు నాలుగేళ్ల క్రితం ఇచ్చిన 2జిబి సెల్‌ఫోన్లతో నెట్‌వర్క్ యాప్‌ల కోసం ఇబ్బందులు పడ్డారని అన్నారు. యాప్‌లకు, ఆన్‌లైన్ పనులకు సపోర్ట్ చేయడం లేదని తెలిపారు. నెట్ సిగ్నలేకపోవడం, సర్వర్ పనిచేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సెల్ ఫోన్లు మార్పు చేయమని పదేపదే అడిగినా ప్రభుత్వం స్పందించ లేదని, అంగన్వాడీ కేంద్రం నిర్వహణకు ట్యాబులు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని అన్నారు. అందుకని ఫోన్లు అప్పగిస్తామని ముందుగా తెలియజేసినా స్పందించకపోవడంతో అంగన్వాడీలు పనిచేయని ఫోన్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాలకు అప్పగించేశారని అన్నారు. దేశమంతా పోషణ్ ట్రాకర్ ఒకే యాప్ ఉంటే ఇక్కడ మన రాష్ట్రంలో మాత్రం ఎక్కువ యాప్‌లు పెట్టారని అన్నారు. 5జి నెట్ వర్కర్‌తో ఫోన్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి మాతృవందనం పథకానికి కొత్తగా అంగన్వాడీలు అప్పగించరాదని కోరారు. పెరిగిన ధరలకనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. మినీ మెయిన్ అంగన్వాడీలుగా మార్చాలన్నారు. గ్రాట్యూటీ జిఒలో మార్పులు చేయాలన్నారు. సమావేశంలో సిఐటియు నాయకులు సిర్ల ప్రసాద్, ఎస్.ధనలక్ష్మి, డి.అనురాధ, జలజాక్షి, అమ్మాయమ్మ, శ్రీలత, విజయ, భవాని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

ఆర్‌టిసి ఉద్యోగుల ధర్నా

పలాస: ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మద్దూర్ యూనియన్ (ఎన్ఎంయు) అధ్యక్ష, కార్యదర్శులు హెచ్.మూర్తి, ఎ.వి.రావులు డిమాండ్ చేశారు. పలాస ఆర్‌టిసి డిపో ఆవరణలో జోన్ సెక్రటరీ పిసకాస వాలీ ఆధ్వర్యాన బుధవారం రెండో రోజు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే పిఆర్‌సి కమీషన్ ఏర్పాటు చేయాలన్నారు. వేతన సవరణ పూర్తయినందున ఐఆర్ ప్రకటించాలన్నారు. డిపోకు చెందిన 4.15 ఎకరాలు స్థలం లూలుకు సంస్థకు బదలాయించిన జిఒను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డిఎలను తక్షణమే చెల్లించాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు గ్రాట్యూటీ, టెర్మినల్ ఎస్ క్యాస్మెంట్ చెల్లింపులు తక్షణమే చెల్లించాన్నారు. ఖాళీలను డైరెక్టు రిక్యూర్మెంట్ ద్వారా భర్తీ చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలన్నారు. పారదర్శకంగా బదిలీల పక్రియ అమలు చేయాలని అన్నారు. ఈ ధర్నాకు ఎపిఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు బోనెల గోపాల్, కార్యదర్శి బి.ఉపేంద్రరావు, అసోషియేట్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎన్.ఆర్.పారావు, డి.శ్రీనివాసరావు, ఎల్ఎఎల్ ఆచారి, ఎన్.పార్వతీశం, వి.ఎన్.రావు, గ్యారేజీ కార్మికులు వున్నయ్య డి.ఎల్.నారాయణ పాల్గొన్నారు.


సమస్యను వివరిస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీలను వేధించడం సరికాదు

పలాస: అంగన్వాడీ కార్యకర్తలను వేధించడం సరికాదని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అన్నారు. కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి అంగన్వాడీ కార్యకర్తలతో బుధవారం కలిసి ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ పార్వతిని నిలదీశారు. రాత్రి వేళల్లో అంగన్వాడీ కార్యకర్తలకు ఫోన్ చేసి ఇబ్బంది పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లాలో ఎక్కడా ఇబ్బంది పెట్టడం లేదని, మీరెందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పిఒ మాట్లాడుతూ ప్రాజెక్టు పాలు వచ్చాయని, వాటిని అంగన్వాడీ కేంద్రాలకు తీసుకెళ్లమని చెప్పడ తప్పా అని అనానరు. ఆన్‌లైన్‌లో లాగిన్ అయ్యి పాలు తీసుకెళ్లకపోతే మీరే ఇబ్బంది పడతారని అన్నారు. అనంతరం వచ్చే సమస్యలకు తాను బాధితురాలు కానని చెప్పారు. తాము ఆన్‌లైన్ ద్వారా విధులు చేయమని ఇది వరకే వినతిపత్రం సమర్పించామని అంగన్వాడీ తెలిపారు.

విద్యార్థులకు పోటీలు

టెక్కలి : శ్రీకాకుళం ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో పట్టణంలోని వివిధ కళాశాలల్లో, పాఠశాలల్లో వివిధ రకాల పోటీలు బుధం నిర్వహించామని టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి నియోజకవర్గ పరిధిలోని టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల పరిధిలోని వివిధ రకాల ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల్లో, పాఠశాలల్లో పోటీలు నిర్వహించామన్నారు. వ్యాసరచన పోటీలకు 66 మంది, వక్తృత్వ పోటీలకు 12 మంది, చిత్రలేఖనం పోటీలకు 30 మంది చొప్పున పాల్గొన్నారని అన్నారు. వీరిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలుపొందిన వారిని ఎంపిక చేసి జిల్లాస్థాయి పోటీలకు పంపనున్నామని తెలిపారు.

ఇళ్ల పట్టాలకు దరఖాస్తుల స్వీకరణ

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని ఇళ్లు వారు పట్టాలకు దరఖాస్తులు చేసుకోవాలని టెక్కలి ఇఒ ఎం.వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31లోగా ఆర్‌డిఒ కార్యాలయం దరఖాస్తులు అందజేయాలన్నారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆకస్మిక పర్యటనలో వారి మౌఖిక ఆదేశాల ప్రాప్తికి టెక్కలి పట్టణంలో అంజనాపురం, చేరీవీధిల్లో ఉన్న ప్రభుత్వ లేఅవుట్లలో ఇళ్ల మంజూరుకు ఆసక్తి కలిగిన వారందరు రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్సులతో కూడిన దరఖాస్తులను అందజేయాలన్నారు.

విద్యార్థులకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


కేన్సర్ లక్షణాలను వివరిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

డా. బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో బుధవారం వర్శిటీ సిబ్బంది, విద్యార్థులకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి (విశాఖ) వారి సహకారంతో వీటిని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని వర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్. రజని ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ మారుతున్న నేటి జీవనశైలి, వాతావరణంలో మార్పులు, గాలి, నీటి కాలుష్యం, ఆరోగ్యపు అలవాట్లలో మార్పు తదితర వాటివలన కేన్సర్ వ్యాధి ఇటీవల కాలంలో అధికమవుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే ఈ వ్యాధిపై అవగాహన కలిగి స్క్రీనింగ్ పరీక్షలు చేసుకున్నట్లయితే ఆరోగ్యదాయకమైన జీవన పయనాన్ని కొనసాగించవచ్చునన్నారు. రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ప్రిన్సిపాల్ డా.ఎం.అనురాధ, ఎస్ఒ డా. కె.సామ్రాజ్య లక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేన్సర్ ఆస్పత్రి వైద్యులు డా. కె.పాల్, డా.హారిక, సిబ్బంది పాల్గొని స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వర్శిటీ ఆరోగ్య కేంద్రం నుంచి డా. ప్రతిభ, ల్యాబ్ టెక్నీషియన్ వై.మౌళీశ్వరరావు తదితరులు సహయ సహకారాలు అందజేశారు. సుమారు 50 మంది ఈ పరీక్షలు చేసుకోవడానికి ముందుకు వచ్చారు.

ఇంటర్ దశ కీలకం

ప్రజాశక్తి- కవిటి

ఇంటర్మీడియట్ దశ కీలకమని, చదువుకునే దశలో ఆకర్షణకు లోనుకావొద్దని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్, మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి అన్నారు. కవిటి కళ్యాణి కళాశాల నూతన విద్యార్థుల ఆహ్వాన వేడుకలు స్థానిక లోళ్ల నారాయణమూర్తి కళ్యాణ మండపంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కుటుంబ సభ్యుల ఆశలు నెరవేర్చాలని సూచించారు. భవిష్యత్‌లో మీకు గుర్తింపు తెచ్చేది చదువేనని, దానికి ఇప్పటి నుంచే బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాశాల యాజమాన్యం ఎంఇఒ ధనుంజయ మజ్జికి ఆత్మీయ సత్కారం చేసింది. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 ఎస్. రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ శంకరరావు, కల్యాణి ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ బిందుమాధవి, సిఆర్‌పి తులసి, బల్లెడ రమేష్, ఉమాపతి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


బహుమతి అందజేస్తున్న రాజేష్



రణస్థలం రూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఇంటింటా జాతీయ జెండా ఎగుర వేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బుధవారం రణస్థలం మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. రామతీర్థాలు కూడలి నుంచి విద్యార్థులతో దేశభక్తి గేయాలు ఆలపించి జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పిషిని జగన్నాథం నాయుడు, పిన్నింటి బానోజీనాయుడు, వడ్డాది శ్రీనివాసరావు, వెలిచేటి కామేశ్వరరావు, దన్నాన చిరంజీవి, సత్తిబాబు, లక్ష్మణరావు, ఎంఇఒ అజ్జాడ త్రినాథరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస : భారతమాతను శ్లాఘిస్తూ పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు బుధవారం పట్టణంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ పతాకాలతో దేశభక్తి నినాదాలతో ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.నరసిహమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, తమ్మినాన పాపారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపాలిటీలో 'హర్ ఘర్ తిరంగా - హర్ ఘర్ స్వచ్ఛత' కార్యక్రమం కమిషనర్ రమేష్ ఆధ్వర్యా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు దేశ భక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం కూడలి వద్ద మానవహారం చేపట్టారు. కౌన్సిలర్ బచ్చు జగన్, మున్సిపల్, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి చర్యలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిఆర్‌యుసిసి సభ్యులు కట్టా సూర్యప్రకాశరావు అన్నారు. ఒడిశా రాష్ట్రంలో బుధవారం నిర్వహించిన కుర్దా రైల్వే డివిజనల్ సలహా సంఘ సమావేశంలో మాట్లాడారు. డిఆర్‌యుసిసి, చైర్మన్, డిఎఎం అలోక్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ త్రిపాఠి, డిఆర్‌యుసిసి సెక్రటరీ అనిల్‌కుమార్ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ పడమర దిశలో స్పెషల్ అభివృద్ధి, పడమర ప్రవేశద్వారం, రోడ్డు, ఇతర సదుపాయాలు కల్పిస్తామన్నారు. కొత్తగా నిర్మిస్తున్న 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిని పడమర వైపు వరకు పొడిగిస్తామని హామీనిచ్చారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో ముఖ్యమైన రైళ్ల నిలుపుదలకు ఉన్నతాధికారులకు సిఫార్స్ చేస్తాశామని, త్వరలో రైళ్ల నిలుపుదలకు అనుమతులు వస్తాయని తెలిపారు. దీంతో పాటు జాడీపూడి, బారువా రైల్వేష్టన్లలో బరంపురం, విశాఖపట్నం వెళ్లే పాసింజర్ రైళ్లకు హాల్ట కల్పిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న సూర్యప్రకాశరావు

అందుబాటులో తైలెరియా వ్యాక్సిన్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పశువైద్య శాలల్లో తయిలేరియా వాక్సిన్ అందుబాటులో ఉందని,పశువులకు ప్రాణాంతకమైన తైలెరియా వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం ఈ టీకా పంపిణీ చేస్తుందని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు సిహెచ్. నర్సింహులు ఒక ప్రకటనలో తెలిపారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. డివిజన్‌కి థెలీరియా వ్యాధి 29,685 డోసులు వచ్చాయని అన్నారు. ఈ వ్యాధి పశువుల్లో తీవ్రమైన జ్వరానికి, బరువు తగ్గిపోవడానికి, కొన్ని సందర్భాలోల మృతికీ కారణమవు తుందని చెప్పారు. ఈ టీకా వేయించడం ద్వారా పశువులను ఈ వ్యాధి నుంచి కాపాడుకోవచ్చని సూచించారు. రైతులు తమ పశువులకు టీకాలు వేయించుకుని వ్యాధి బారిన పడకుండా చూసుకోవాలని కోరారు. డివిజన్‌లోని అన్ని పశు వైద్య కేంద్రాల్లో ఈ టీకా అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. రైతులు తమ సమీప పశువైద్య కేంద్రాన్ని సంప్రదించి తమ పశువులకు ఉచితంగా టీకాలు వేయించుకోవచ్చని తెలిపారు.


నర్సింహులు

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి- కవిటి

కవిటి కొత్తూరు బిఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల భద్రత, సైబర్ నేరాల నివారణకు సంబంధించి బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ శక్తి టీం పాల్గొని విద్యార్థులకు 'శక్తి యాప్' వినియోగం, మహిళల భద్రతా చర్యలు, సైబర్ మోసాలపై జాగ్రత్తలు వంటి అంశాలపై విశదీకరించారు. కవిటి పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుల్ ధనలక్ష్మి మాట్లాడుతూ శక్తి యాప్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసుల సహాయం పొందవచ్చని, ముఖ్యంగా యువతులు ఈ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అలాగే సోషల్ మీడియా వేదికల్లో అనవసరమైన సమాచారం పంచుకోవడం, తెలియని లింకులు ఓపెన్ చేయడం, అనుమానాస్పద ఫోన్ కాల్స్‌కు స్పందించడం వంటి వాటిని నివారించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జల్లు సుబ్బారావు మాట్లాడుతూ ఈ తరహా అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో భద్రతా చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా, సైబర్ నేరాల నుంచి రక్షించుకోవడానికి అవసరమైన జ్ఞానాన్ని అందిస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ముకుందరావు, జయప్రకాష్, సతీష్, శ్రీదేవి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: శక్తియాప్ మహిళలకు రక్షణ కవచం వంటిదని, స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని శక్తిటీం-2 ఎస్ఐ ఎం.రవి పేర్కొన్నారు. మండలంలోని కింతలి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిస్టమ్ కళాశాలలో బుధవారం శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌తో పాటు పలు టోల్‌ఫ్రీ నెంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సిహెచ్ గోవిందరాజులు, కరస్పాండెంట్ మోహనరావు, ఉపాధ్యాయులు, శక్తిటీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల ఆవరణలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై 'సంకల్పం' అవగాహనా ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతకు మాదకద్రవ్యాలు జీవితాన్ని ఎలా నాశనం చేస్తాయో వివరించారు. మాదకద్రవ్యాలను పూర్తిగా దూరం పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి పోలీస్ సిబ్బంది, నెహ్రూ యువకేంద్ర వాలంటీర్ కె.మధు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎల్‌సి కౌన్సిలర్ ఎస్. రవిబాబు అన్నారు. బుధవారం మండలంలోని వంజంగిపేటలో యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో అమలవుతున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఎటిఎం కార్డుల వలన కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. అనంతరం కళాజాత బృందాల ద్వారా బ్యాంకుల వలన కలిగే లాభాలు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి లక్ష్మి, సిసి చంద్రరావు, సిఎఫ్ఎస్ వనజాక్షి, కళాజాత బృందం సభ్యులు ఎం.రమేష్, తారక రామారావు, సిఎఫ్ఎల్ సిబ్బంది చిగురుపల్లి వెంకటేష్, బొడ్డేపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సంతబొమ్మాళి : మాట్లాడుతున్న ఎస్ఐ సింహాచలం


ఆమదాలవలస : బ్యాంకు పథకాలను వివరిస్తున్న కళాజాత బృందం


మాట్లాడుతున్న డిఎస్‌పి లక్ష్మణరావు

21 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట పట్టణంలో 21 కేజీల గంజాయి పట్టుకున్నామని టెక్కలి డిఎస్‌పి లక్ష్మణరావు తెలిపారు. నరసన్నపేట సర్కిల్ కార్యాలయంలో సిఐ, ఎస్ఐతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక పైడిపల్లి ఆలయం సమీపం జాతీయ రహదారిపై పక్కన కొందరు గంజాయి తాగుతున్న సమాచారం అందించిందని తెలిపారు. మేరకు ఎస్ఐ దుర్గాప్రసాద్, పోలీసులు వెళ్లి పరిశీలించారని అన్నారు. సూరత్ నగర్‌కి చెందిన మణి, మోహన్‌లు గంజాయి తాగుతూ పట్టుబడ్డారని అన్నారు. వారిని అదుపులో తీసుకొని ఎక్కడ నుంచి గంజాయి లభించందని ఆరా తీశామన్నారు. పర్లాకిమిడికి చెందిన సంజు అనే వ్యక్తి దగ్గర కొనుగోలు చేసినట్లు తెలిపారని అన్నారు. సత్యవరం కూడలిలో బస్ షెల్టర్ దగ్గర పెట్టుకొని 21 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


కేసు వివరాలను వెల్లడిస్తున్న సిఐ మంగరాజు

బంగారం చోరీ నిందితుల అరెస్టు

ప్రజాశక్తి- సోంపేట


మండలంలోని కొర్లాంకు చెందిన తూగా బాలమ్మ, గార వాణి ఇళ్లల్లో ఇటీవల దొంగతనాలకు పాల్పడిన ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు మహిళలను బుధవారం రాత్రి అరెస్టు చేసినట్లు సోంపేట సిఐ మంగరాజు తెలిపారు. ఈ మేరకు నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. సందర్భంగా మాట్లాడుతూ బాధితుల ఇళ్లల్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగలగొట్టి రూ.44 వేలు విలువచేసే బంగారం, వెండి, నగదును అపహ రించారని తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సిసి కెమెరాలు పరిశీలించి నిందితుల కోసం గాలింపు చేపట్టామని తెలిపారు. బుధవారం సాయంత్రం కొర్లాం కూడలి వద్ద పోలీసు బందోబస్తు నిర్వహిస్తుండగా ఇద్దరు మహిళలు చంటి పిల్లలను ఎత్తుకొని అనుమాన స్పదంగా తిరుగు తుండగా వారిని విచారించామన్నారు. విచారణలో తాము ఇటీవల కొర్లాంలో దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించారని తెలిపారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని సంఘటనపై కేసు దర్యాప్తు చేపట్టి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలి పారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన బారువ ఎస్ఐతో పాటు సిబ్బందిని ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి అభినందించినట్లు తెలిపారు.


పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ ఈశ్వరరావు

గరుడభద్రలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని గరుడభద్రలో పారిశుధ్య పనులు బుధవారం సర్పంచ్ గూడ ఈశ్వరరావు ఆధ్వర్యాన చేపట్టారు. సచివాలయం చుట్టూ పరిసరాలు, అర్అండ్‌బి రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెత్తా, చెదారం, శ్మశాన వాటిక పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ నిధులతో ఉపయోగించి ప్రొక్లెయినర్ సహాయంతో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులు అరికట్టడానికి పారిశుధ్యం చాలా అవసరమన్నారు. పంచాయతీ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పట్టించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి యు.కృష్ణారావు, వార్డు మెంబరు చొక్కర శేషగిరి, వి.ఢిల్లీరావు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎల్‌పిఒ రమణ

చెత్త సంపద కేంద్రం సందర్శన

కొత్తూరు : స్థానిక మండల కేంద్రంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని డిఎల్‌పిఒ ఐ.వి.రమణ బుధవారం చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. అందులో వర్మీ తయారు చేయు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హరిక రాయబార్లకు పలు సూచనలు సలహాలు అందించారు. పొడి, తడి చెత్తలను వేర్వేరుగా సేకరించారు. అనంతరం స్థానిక సచివాలయం వన్‌లో రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట కార్యదర్శి అప్పలరాజు ఉన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి- కవిటి

మనం చేసే రక్తదానం ఎంతోమందికి ప్రాణదానం చేస్తుందని వక్తలు అన్నారు. మండలంలోని బల్లిపుట్టుగలో ఉద్దానం బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మార్పు వంశీకృష్ణ జయంతిని పురస్కరించుకొని అతని స్నేహితులు ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో 20 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బార్ల సతీష్, కాశీ సాహూ, లోళ్ల సాగర్, బార్ల ప్రదీప్, విశ్వేశ్వరరావు, సిసింద్రీ, గణేష్ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

పంటల సస్యరక్షణ చర్యలు



కోటబొమ్మాళి : అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కోటబొమ్మాళి: ఖరీఫులో వరి, వేరుశెనగ పంటలను సాగుచేస్తున్న రైతులు పంటలకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధలు పాటించాలని టెక్కలి ఎడిఎ కె.జగన్మోహన్‌రావు అన్నారు. మండలంలోని రేగులపాడులో బుధవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు రైతుల ఖాతాలో అన్నదాత సుఖీభవ డబ్బులు జమకాకపోతే మీ రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు, సిబ్బంది గణపతి, రైతులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: అధునాతన సాగు పద్ధతులు, పంట సంరక్షణ చర్యలు వల్ల అధిక దిగుబడి సాధించవచ్చునని ఎడిఇ టి.భవానీశంకర్, ఎఒ అజయ్‌కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని రక్తకన్న, బిర్లంగి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అధునాతన సాగు పద్ధతులు, పంట సంరక్షణ చర్యలు, సమగ్ర పోషక నిర్వహణ, ఎరువులు, పురుగు మందుల సమయానుకూల, సమర్థవంతమైన వినియోగంపై అవగాహన కల్పించారు.

కవిటి: రసాయన ఎరువుల వినియోగంలో యూరియా పరిమాణాన్ని తగ్గించాలని ఎఒ పిరియా శ్రీదేవి రైతులకు సూచించారు. మండలంలోని మాణిక్యపురం, బల్లిపుట్టుగ గ్రామాల్లో వరి పొలాలు బుధవారం పరిశీలించారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఎన్‌పికె ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పిఎంఎఫ్‌బివై నమోదు ఈనెల 15తో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిఇఒ లలిత, విఎఎ జగదీష్, రైతులు బార్ల జనార్ధనరావు, దేవరాజు సాహూ, పిన్నింటి శ్రీనివాస వరప్రసాద్, బి.బాబూరావు, పి.సందీప్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రైతు శ్రేయస్సే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

కూటమి ప్రభుత్వం రైతు శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, నాయకులు సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్ అన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా సినిమా హాల్ రోడ్డు నుంచి బస్టాండ్ వరకు ట్రాక్టర్లు, మోటార్ సైకిల్‌తో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ ఏటా రైతుకు రూ.20వేల చొప్పున అందిస్తామని చెప్పినట్టే మొదట విడత రూ.7 వేలు రైతుల ఖాతాలో జమ చేసినట్టు చెప్పారు. ఇదే కోవలో మిగతా పథకాలు కూడా అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆరింగి మధు, బెందాళం కామరాజు, వజ్జ రంగారావు, పుల్లట సంతోష్, ప్రగడ మణిబాబు, సనపల కామేశ్వరరావు, పొందూరు బాలకృష్ణ, బెందాళం చక్రధర్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న జవాన్లు

జవాన్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- పలాస

తమతో పాటే జవాన్‌గా పని చేస్తూ ఈ నెల 2న మృతి చెందిన తోటి జవాన్ కుటుంబానికి ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. మండలంలోని పద్మనాపురానికి చెందిన బి.ఈశ్వరరావు ఐటిబిపి 21వ బెటాలియన్ జమ్మూ-కశ్మీర్‌లో విధులు నిర్వర్తించేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఐటిబిపి తెలుగు జవాన్లు రూ.91 వేలు జవాన్లు పి. విజయ్, కె.మురళీమోహన్, షణ్ముఖారావు బుధవారం అందజేశారు.

వరుస పద్ధతులతో అధిక దిగుబడి



రైతులకు సూచనలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ప్రజాశక్తి- రణస్థలం

వరి లైన్ పద్ధతుల్లో నాటడంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ అధికారి హేమ సుందరరావు రైతులకు సూచించారు. మండలంలోని రావాడలో వరిలో పంటల వైవిధ్యతపై గంట్యాడ రమణమ్మ ఎకరా విస్తీర్ణంలో వరి లైన్ పద్ధతుల్లో నాటడంపై రైతులకు బుధవారం నాటి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ వరి లైన్ ఉడుపులో, సొంత పొలాల్లో ఎకరాకు 12 కేజీలు జీవ వైవిద్య పంటలను వేసుకోవాలన్నారు. పెసలు రెండు కేజీలు, మినుములు ఒక కేజీ, ఉలవలు రెండు కేజీలు, కట్టెజనుము రెండు కేజీలు, అలసందలు రెండు కేజీలు, గోంగూర ఒక కేజీ, తోటకూర ఒక కేజీ విత్తనాలను నాటాలన్నారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేసి ఎద పద్ధతిలో నాటాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కంబపు కృష్ణ, కలివరపు శివశంకర్, గంట్యాడ ఏసుబాబు, రమణమ్మ, సూర్యం, జనార్ధనరావు, రైతులు పాల్గొన్నారు.

శ్రీవరి లాభదాయకం

నరసన్నపేట: శ్రీవరి లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ రైతులకు సూచించారు. మండలంలోని రావులవలసలో ప్రకృతి వ్యవసాయ రైతులు పల్లి శివ, పల్లి శంకరరావు పొలాల్లో యంత్రాలతో ఏడు ఎకరాల్లో వరినాట్లు బుధవారం నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీవరి సాగు చేయడం వల్ల విత్తనం ఖర్చు తగ్గుతుందన్నారు. 15 రోజుల లేత నారు మొక్క మొక్కకి దూరం 25 సెంటీ మీటర్లు దూరం పాటించాలన్నారు. గాలి, వెలుతురు బాగా తగిలి పిలకలు బాగా పెట్టి సాధారణ పద్ధతి కంటే 15 బస్తాలు దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అదనపు డిపిఎం ధనంజయ్, మాస్టర్ ట్రైనర్ తోట రమణ పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించాలని సర్ఫ్ ఎపిఎం ప్రసాదరావు సూచించారు. మండల మహిళా సమఖ్య భవనంలో మహిళా సంఘాల సభ్యులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘాల బ్యాంకు ఖాతాలో ఉన్న పొదుపును తక్కువ వడ్డీకి ఇస్తున్నారని అన్నారు. అలాగే ప్రతి గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం కోసం ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘ సహాయకులు, అధ్యక్షులు, సిసిలు పాల్గొన్నారు.

దాడిపై ఖండన

గుర్రంకొండ మండలం అన్నమయ్య జిల్లా ఎపిఎం రజనిపై దాడిని ఖండిస్తూ మండల వెలుగు సిబ్బంది,



మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

ఎపిఎం ఖండించారు. ఇలాంటి దుశ్చర్యను సహించమన్నారు. దీనికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి కోరారు. కార్యక్రమంలో సిసిలు మోహనరావు, దాలయ్య, అకౌంటెంట్లు మోహిని, వాణీభవాని, కంప్యూటర్ ఆపరేటర్ విష్ణుబాబు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లా ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో తయారు చేసిన ఫిజికల్ సైన్స్ స్టడీ మెటీరియల్‌ను పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పైల రవికుమార్, ఎస్.అరుణ, బంగారు శరత్ కుమారి ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు బుధవారం ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి మండల ఎంఇఒ కె.ఎ. రాములు పాల్గొని విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పి. రవికుమార్, ఎస్. అరుణ, పి.రామస్వామి నాయుడు, పి. మోహనరావు, గొంటి గిరిధర్ తదితరులు విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గురుగుబిల్లి అప్పారావు, ఎం.ఉమాకుమారి, జి.కుమారి, శ్రీనివాస్, జనవిజ్ఞానవేదిక సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం



విలేకరులతో మాట్లాడుతున్న జనార్ధనరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మహిళల అభ్యుదయానికి దోహద పడుతున్నాయని టిడిపి నాయకులు, విజయనగరం జిల్లా కాళింగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పేడాడ జనార్ధనరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని శ్రీహరిపురంలో తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఆగస్టు 15 నుంచి అమల్లోకి రానుందని, గత ప్రభుత్వంలో కల్తీ మద్యం, గంజాయి సాగు, అవినీతి ఆశ్రిత పక్షపాతం పెరిగి ప్రజలు పేదరికంలో కూరుకుపోయారని ఆరోపించారు. రానున్న రోజుల్లో ఉద్యోగులు, పెన్షనర్లకు డిఎ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు, కూన అప్పలనాయుడు, సనపల రమణారావు, న్యాయవాది కంచరాన మురళీధర్, సీపాన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



నరసింహరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒబిసి వర్తించేలా చట్టం తేవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఉత్తరాంధ్ర మినహా, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న తూర్పు కాపులందరికీ ఒబిసి రిజర్వేషన్ వర్తించేలా పార్లమెంట్‌లో బిల్లుపెట్టి అమలు చేయాలని కోరుతూ బిజెపి జాతీయ అధికార ప్రతినిధి, మాజీ రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహరావును బుధవారం న్యూఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్ర మోహన్, రాష్ట్ర చైర్మన్ గిరడా అప్పలస్వామి, ఒబిసి సాధన కమిటీ చైర్మన్ పల్లా వెంకటరావుతో కూడిన బృందం సమస్య వివరించి ధ్రువీకరణ పత్రం అందజేసింది. పార్లమెంట్‌లో బిల్లుపెట్టి చట్టం చేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు.



బదిలీ ఉద్యోగులను సన్మానిస్తున్న సహోద్యోగులు

బదిలీ ఉద్యోగులకు సన్మానం

సంతబొమ్మాళి : మండలంలోని పలు సచివాలయాల్లో విధులు నిర్వహించి, బదిలీపై వెళ్లిన ఏడుగురు వెల్ఫేర్ అసిస్టెంట్లను బుధవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జయంతి ప్రసాద్ ఆధ్వర్యాన సహోద్యోగులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ బదిలీ పొందిన వెల్ఫేర్ సిబ్బంది సేవలను ప్రశంసించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిద్దార్థ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం



ఉషారాణి

వజ్రపుకొత్తూరు: వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల మండలం ఒంటిమిట్ట జెడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని వైసిపి మండల మహిళా విభాగం అధ్యక్షులు జల్లు ఉషారాణి అన్నారు. ఈ మేరకు పూండిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి టిడిపి నాయకులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఓటింగ్‌లో పాల్గొనడం, ఓటు హక్కు ఉన్న స్థానికులు పోలీసులు కాళ్లు పట్టుకున్నా ఓటు వేయకుండా ప్రజాస్వామ్యాన్ని పాదాక్రాంతం చేశారని అసహనం వ్యక్తం చేశారు. అరాచకాలను, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడాల్సిన ప్రభుత్వ పెద్దలు ప్రతిపక్షంపై బురద జల్లే కార్యక్రమాలకు పూనుకోవడం బాధాకరమన్నారు.

సొంతింటి కల నెరవేర్చుకోవాలి

పలాస: ఎల్‌ఆర్ఎస్‌తో మీ సొంతింటి కల నెరవేర్చుకోవాలని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ నడిపేన రామారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. స్థలం కొన్నట్లు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉంటే ఎల్‌ఆర్ఎస్‌లో ప్లాట్‌ను క్రమబద్ధీకరించుకోవచ్చునని అన్నారు. అనుమతులు లేని లేఅవుట్లలో ఈ ఏడాది జూన్ 30లోగా ప్లాట్ కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు ఎవరైనా ఎల్‌ఆర్ఎస్ పథకంలో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఈ పథకం ఫీజులో చాలా రాయితీలను ప్రభుత్వం ప్రకటించారన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు రూ.పది వేలు తగ్గకుండా ప్రాథమికంగా చెల్లించాలన్నారు. ఈ అవకాశం ఈ ఏడాది అక్టోబరు నెలాఖరు వరకు ఉంటుందని తెలిపారు.